
# ఇక ఇంగ్లీష్‌లోనూ.. ప్రాక్టికల్స్

- ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రారంభం
- ఈ నెల 16న పరీక్ష
- హాజరు కానున్న 4,361 మంది విద్యార్థులు
- ఆంగ్ల భాషపై పట్టు సాధించడమే లక్ష్యం

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 11: ఇప్పటివరకు ఒకేషనల్ కాకుండా జనరల్ సబ్జెక్టులలో కేవలం సైన్స్, మ్యాథ్స్‌లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాని, ఇకనుంచి ఇంగ్లీష్‌లో కూడా ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి ఇంగ్లీషు సబ్జెక్టులో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు సమాయత్తమైంది. ఈ నెల 16న ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

### ఇంటర్ ప్రథమ విద్యార్థులకు మాత్రమే..

ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తారు. వచ్చే సంవత్సరం నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. గతంలో జనరల్ స్ట్రీమ్‌లో ఇంగ్లీషు పేపర్‌కు 100 మార్కులుండేవి. ఈ సంవత్సరం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిస్తుండగా ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు కేటాయించారు. మిగతా 80 మార్కులకు థియరీ ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రాక్టికల్ పరీక్షలో 20 మార్కులకు గాను 7 మార్కులు, థియరీలో 28 మార్కులు రావాలి. ఎందులో మార్కులు తక్కువ వచ్చినా, లేదా ప్రాక్టికల్ పరీక్షకు గైర్హాజరైనా వారిని ఫెయిల్ క్యాండెట్స్‌గా పరిగణిస్తారు.




### ప్రాక్టికల్ పరీక్షలో మార్కులు ఇలా ...

ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షలో కమ్యూనికేటివ్ ఫంక్షన్స్ - 4 మార్కులు, జస్ట్ ఎ మినిట్ - 4, రోల్ ప్లే - 4, లిజనింగ్ కాంప్రిహెన్షన్ - 4, రికార్డుకు - 4 మార్కులు ఉంటాయి. కమ్యూనికేటివ్ ఫంక్షన్స్, జస్ట్ ఎ మినిట్, రోల్ ప్లే లకు సంబంధించి మూడు ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షలు (1, 2, 3) ఈ పాటికే పూర్తి చేసి విద్యార్థుల యొక్క మార్కుల లిస్టులను ఒక్కొక్క టెస్ట్ వారీగా వేరువేరు లిస్టులలో మూడు సపరేటు సీల్డ్ కవర్లలో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్‌కు అందజేసి ఉండాలి. ఎవరైనా ఇంత వరకు ఆ పని చేయకపోతే ఈ నెల 16 లోగా పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు.

### 16న ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష

బోర్డు ప్రకటించినట్లుగా ఈ నెల 16న ఇంటర్నల్ అసెస్‌మెంట్ నాలుగో పరీక్ష (లిజనింగ్ కాంప్రిహెన్షన్ టెస్ట్) నిర్వహిస్తారు. ఒక వేళ ఏ విద్యార్థి అయినా పై మూడు టెస్టులకు హాజరు కాకపోయి ఉంటే వారికి 16న చివరి అవకాశంగా లిజనింగ్ కాంప్రిహెన్షన్ టెస్టుతో పాటు మిగతా మూడు పరీక్షలు కూడా నిర్వహించి మార్కులను పోస్టు చేయాలి.

### ఒక్కో బ్యాచ్‌కు 50 మంది

ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహణకు 50మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజిస్తారు. పరీక్షా సమయం ఒక్క గంట మాత్రమే. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు రెండవ బ్యాచ్ ఉంటుంది. ఇలా గంటకు ఒక్క బ్యాచ్ చొప్పున నిర్వహించాలి. మధ్యాహ్నం 1గం.ల నుంచి 2గం.ల వరకు భోజన విరామం ఉంటుంది. ఈ పరీక్షను సంబంధిత కళాశాల లెక్చరరే నిర్వహించాలి.

### నిర్వహణ ఇలా ...

పరీక్షా సమయం ప్రారంభం కాగానే విద్యార్థులకు ఆన్సర్ షీట్స్ ఇచ్చిన తరువాత వారికి లిజనింగ్ కాంప్రిహెన్షన్ టాపిక్‌లో ఉన్నటువంటి ఏదైనా ఒక పేరాగ్రాఫ్ చదివి వినిపించాలి. తరువాత విద్యార్థులకు 4 ప్రశ్నలను బోర్డు పై రాసి ఆన్సర్ పేపరులో ఆ ప్రశ్నలను చూసి రాసుకోమని చెప్పాలి. తరువాత అదే పేరాగ్రాఫ్ ను మరొకసారి చదివి వినిపించాలి. రెండవ సారి చదివినప్పుడు విద్యార్థులు జాగ్రత్తగా విని ఇచ్చినటువంటి ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. 4 సమాధానాలకు గాను 4 మార్కులు ఉంటాయి. పై మార్కులను, రికార్డు మార్కులను ఒకే లిస్టులో పోస్ట్ చేసి గతంలో వేసిన ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులతో పాటు బోర్డు సైట్ లో ఆరోజే అప్‌లోడ్ చేయాలి.

### వొకేషనల్ స్ట్రీమ్‌కు 10 మార్కులు

ఒకేషనల్ స్ట్రీమ్ విద్యార్థులకు ఆంగ్ల భాషలో థియరీకి 40 మార్కులు ప్రాక్టికల్స్ కు 10 మార్కులు ఉంటాయి. థియరీ లో 40 మార్కులకు గాను 14 మార్కులు, ప్రాక్టికల్స్ లో 10 మార్కులకు గాను 3 మార్కులు రావాలి. కమ్యూనికేటివ్ ఫంక్షన్స్ కు 4 మార్కులు, లిజనింగ్ కాంప్రిహెన్షన్‌కు 4 మార్కులు, రికార్డుకు 2 మార్కులు ఉంటాయి. జస్ట్ ఎ మినిట్, రోల్ ప్లే టాపిక్‌లు వీరికి ఉండవు. మిగతాదంతా జనరల్ స్ట్రీమ్ మాదిరిగానే ఉంటుంది.

### జిల్లాలో 4,361 మంది విద్యార్థులు

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు జిల్లాలో 4361 మంది ఉన్నారు. జనరల్ స్ట్రీమ్‌లో 3164 మంది ఉడగా వొకేషనల్ స్ట్రీమ్‌లో 1197మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. అదే విధంగా ఈ నెల 17న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 19న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తారు.

### ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకే..



**బైరి శ్రీనివాస్, డీఐఈవో, జనగామ**

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకే ఈ సంవత్సరం నుంచి ఇంగ్లీషు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఉత్తీర్ణతకు ఈ మార్కులు దోహదం చేస్తాయి. ఇప్పటికే కళాశాలల్లో విద్యార్థులకు ఇంగ్లీషు ప్రాక్టికల్‌పై అవగాహన కల్పించాం. విద్యార్థులు తప్పకుండా ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్షకు హాజరు కావాలి.



భక్తులతో కిటకిటలాడుతున్న వనదేవతల ప్రాంగణం

# మేడారంలో మొక్కుల జోరు

- సమ్మక్క సారలమ్మల దర్శనాలకు భక్తుల బారులు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు



వనదేవతల సన్నిధిలో కోడితో మొక్కుతున్న యువతి

మేడారం, ఫిబ్రవరి 11 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాజాతర ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా వనదేవతలకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నలమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) చెల్లించుకున్నారు.

### గద్దెలను తాకి పులకించి

మేడారం మహా జాతరకు ముందుగా సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం తరలి వచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను తాకి తరించి పోతున్నారు. మహా జాతరలో అవకాశం రాకపోవచ్చని భావిస్తూ ముందస్తుగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్నారు.

### రద్దీని నియంత్రించని పోలీసులు

మహా జాతరకు ముందుగా వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలి వచ్చిన భక్తజనాన్ని గద్దెల వద్ద పోలీసులు నియంత్రించలేక పోయారు. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులు, శాఖల అధికారులు, బంధువులు, మిత్రులకు ప్రత్యేక దర్శనాలు కల్పించే పనిలో పడ్డారు. సామాన్య భక్తులకు మాత్రం దర్శనాల్లో ఇబ్బందులు తప్పలేదు. వీవీఐపీ, వీఐపీల దర్శనాల కారణంగా దగ్గరకు వెళ్లలేని భక్తులు దూరం నుంచే బెల్లం, కానుకలు, ముడుపులు విసిరారు. భక్తులందరినీ సమ దృష్టిలో చూడాలని, సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.

## భారీగా ఎంపీడీవోల బదిలీలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్య

వివరాలు 6లో..

# చిన్నారులను మింగిన చెరువులు

- వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి
- తాడిచర్లలో మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు అన్నదమ్ములు..
- అమ్మాపురంలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు..
- భూపాలపల్లి, మానుకోట జిల్లాల్లో విషాదం



అరుణ్ కుమార్, కార్తీక్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు



అమ్మాపురం గ్రామ చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు యాకూబ్, జంపా

మల్హర్/తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11: చెరువులో పడి నలుగురు చిన్నారులు మృతిచెందారు. మేకలను మేపేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు చెరువులో దిగగా నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ప్రమాదం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలో జరిగింది. అలాగే ఈత కొట్టేందుకు చెరువుకు సరదాగా వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. చిన్నారుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

### మేకలను మేపేందుకు..

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బొంతల అనూష - రాజు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమారులు అరుణ్ కుమార్ (12), కార్తీక్ (9)తోపాటు ఓ కూతురు ఉంది. అరుణ్‌కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సమీపంలోని సన్నూర్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉన్న అతడు.. మూడు నెలల కిందట ఇంటికి వచ్చేశాడు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో అతడిని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పది రోజుల కిందట చేర్పించారు. రెండో కుమారుడు కార్తీక్ స్థానికంగా నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే రాజు కొన్ని మేకలను కొన్నాడు. వాటిని అతడి భార్య అనూష మేపుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాజు వ్యక్తిగత పని నిమిత్తం కాళేశ్వరం వెళ్లాడు. రోజులాగే అనూష మేకలు మేపుకుంటూ ఇద్దరు కొడుకులను కూడా తోడుగా తీసుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో అనూష పిల్లలు ఇద్దరికి మేకలను అప్పగించి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మేకలు ఇంటికి చేరాయి. ఇద్దరు పిల్లలు మాత్రం తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి.. చుట్టుపక్కల వెతికింది. చెరువు వద్దకు వెళ్లి చూడగా ఇద్దరి చెప్పులు కనిపించాయి. దీంతో ఏడుస్తూ గ్రామంలోకి వచ్చి కొంతమందిని వెంట తీసుకొని వెళ్లింది. చెరువులో గాలించగా ఇద్దరి కొడుకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని

మిగతా 8వ పేజీలో

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ నర్సింగరావు
- ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఆర్‌డీవో డైరెక్టర్ నర్సింగరావు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 11: విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఆర్‌డీవో డైరెక్టర్ నర్సింగరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రం లోని ఏకశిల బీఈడీ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశానికి జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ అధ్యక్షత వహించగా నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, అంగ్లంలో ఇబ్బంది పడ్డా అంచెలంచెలుగా ఎదుగుతూ డీఆర్‌డీవో డైరెక్టర్ స్థాయికి ఎదిగానని అన్నారు. విద్యార్థులు సైన్స్ లో పట్టు సాధించాలని, తెలియని విషయాలు తెలుసుకోవాలని, ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అనేక కొత్త విషయాలు తెలుసుకోగలుగుతామని అన్నారు.

### విజేతలు వీరే ...

మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేతలను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీషు మీడియం విభాగంలో సిద్దిపేట జిల్లా ప్రథమ, సూర్యాపేట ద్వితీయ, ఆదిలాబాద్ తృతీయ స్థానంలో నిలవగా, ప్రైవేటు పాఠశాలల ఇంగ్లీషు మీడియం విభాగంలో హనుమకొండ ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, జయశంకర్ భూపాలపల్లి తృతీయ స్థానంలో, ప్రభుత్వ పాఠశాలల తెలుగు మీడియం విభాగంలో నాగర్ కర్నూల్ ప్రథమ, వనపర్తి ద్వితీయ, రంగారెడ్డి జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు డీఆర్‌డీవో డైరెక్టర్ బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలలో 32 జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలతో పాటు పాల్గొన్న అన్ని జిల్లాల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జేవీవీ ప్రచురణలు, బ్యాగ్‌లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సైంటిస్ట్ శారద, జేవీవీ రాష్ట్ర బాధ్యులు రామచంద్రయ్య, చెలిమెల రాజేశ్వర్, ఎంఎన్‌వో రాజేందర్, జేవీవీ జిల్లా అధ్యక్షులు మర్రెడ్డి, రవీందర్, జిల్లా బాధ్యులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, కృష్ణ, బాలరాజు, శోభన్‌రెడ్డి, శ్రీనివాసచారి, ఉమాదేవి, కిరణ్, గోపాలకృష్ణ, శ్రీహరి, సత్తయ్య, ఆకుల జ్యోతి, ధర్మభిక్షం ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బ్రాందీషాపులో దొంగల బీభత్సం

- రూ.2 లక్షలు, మద్యం బాటిళ్లు చోరీ



సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యం

జనగామ టౌన్, ఫిబ్రవరి 11: జిల్లాకేంద్రంలోని ఓ బ్రాందీ షాపులో అర్ధరాత్రి చోరీ జరిగింది. రూ2 లక్షల నగదుతో పాటు పలు మద్యంబాటిళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో గల దుర్గాసింధు వైన్‌షాపులో ఈ ఘటన జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1:37 గంటలకు వైన్‌షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు ముందుగా లాకర్ ఓపెన్ చేసి సుమారు రూ2 లక్షలు తీసుకున్నారు. తర్వాత పలు మద్యం బాటిళ్లను కూడా తీసుకుని ఉడాయించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వైన్‌షాపు నిర్వాహకులు షాపు తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు చోరీ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. దొంగలను వెతికే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో వైన్‌షాపులోనూ దొంగతనానికి దొంగలు విఫలయత్నం చేసినట్లు తెలిసింది.

## గురుకుల ప్రవేశ పరీక్షకు 1,131 మంది హాజరు



జనగామ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ ఎన్.రజని

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 11: ఐదో తరగతిలో ప్రవేశాలకు గాను జిల్లాలో నిర్వహించిన తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షకు 1131 మంది హాజరయ్యారు. ఆదివారం జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కోఆర్డినేటర్ ఆగోని నర్సింహులు గౌడ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1182 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1131 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు జరుగగా పరీక్షల తీరును యాదాద్రి భువనగిరి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రజని పరిశీలించారు.

# పెళ్లిసందడికి వేళాయె...

- ఈనెల 11 నుంచి ప్రారంభమైన మాఘమాసం
- ఏప్రిల్ 26 వరకు శుభ ముహూర్తాలు
- వరుసగా మూడు నెలలు మోగనున్న పెళ్లి బాజాలు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 11: వివాహం.. ప్రతి ఒక్కరి జీవితంలో అపురూపమైన వేడుక. అందుకే కలకాలం గుర్తుండిపోయేలా చేసుకోవాలని అందరూ భావిస్తుంటారు. పిల్లల తల్లిదండ్రులైతే మంచి ముహూర్తంలో మూడు ముళ్లు వేయించాలని భావిస్తుంటారు. అందుకోసం అవసరమైతే నెలల తరబడి వేచి చూస్తుంటారు. మిగతా మాసాలు ఎలా ఉన్నా మాఘమాసం మాత్రం మంచి ముహూర్తాలను మోసుకువస్తుంది. అందుకే ఈ మాసం కోసం అందరూ ఎదురు చూస్తుంటారు. ఈనెల 11 నుంచి మాఘమాసం ప్రారంభం కావడంతో పెళ్లిసందడి నెలకొంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మేళాలు మోగనున్నాయి. ఏప్రిల్ 26వ తేదీ వరకు మూడు నెలల పాటు 30 మాత్రమే వివాహ ముహూర్తాలు ఉండడంతో.. వేద మంత్రాల సాక్షిగా జీవితాన్ని పండించుకునేందుకు కొంగులు ముడివేసుకోనున్నాయి. ఆ తరువాత శ్రావణమాసం (ఆగస్టు)లోనే తిరిగి వివాహాలు జరుగుతాయని పండితులు చెబుతున్నారు.

### శుభ ముహూర్తాల మాసం.. మాఘం...

మాఘం.. శుభ ముహూర్తాల మాసం.. శుభ ముహూర్తాలకు మంచి రోజులు ఎపుడెపుడా అని ఎదురు చూస్తున్న వారికి ఆశలు తీరే నెల వచ్చేసింది. ఇంతకాలం పుష్యమాసం (శూన్యమాసం) కావడంతో శుభ కార్యక్రమాలు జరగలేదు. ఆదివారం నుంచి మాఘమాసం ప్రారంభం కావడంతో వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యాలు జరుగనున్నాయి. మాఘ, ఫాల్గుణం, చైత్ర మాసాలు శ్రేయస్కరమని పండితులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు ముగుస్తూండడంతో ఇళ్లల్లో శుభ కార్యాలకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ మాసంలో జిల్లాలో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కల్యాణ మండపాల వద్ద సందడి కనిపిస్తోంది.



### వివాహ ముహూర్తాలు ఇవే...

| | |
|---|---|
| మాఘం | ఫిబ్రవరి 13, 14, 17, 18. 24, 28, 29, మార్చిలో 2, 3 తేదీలు. |
| ఫాల్గుణం | మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్‌లో 3, 4 తేదీలు |
| చైత్రం | ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు ... ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం |

### ఏప్రిల్ 26 వరకు సుమారు 30 ముహూర్తాలు...

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మాఘమాసంలో ఈనెల 13 నుంచి క్రోధి నామ సంవత్సరం చైత్ర మాసం వరకు అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకు మూడు నెలల్లో సుమారు 30 ముహూర్తాలు మాత్రమే ఉన్నట్లు చెబుతున్నారు. ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠమాసాల్లో వివాహ ముహూర్తాలు లేవు. ఆ తరువాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికి రాదు. మళ్లీ శ్రావణమాసం అంటే ఆగస్టు నుంచి వివాహాలు జరుగుతాయని బ్రాహ్మణ పండితులు చెబుతున్నారు. సాధారణంగా వివాహాలు వేసవి సెలవుల్లో చేయాలని ఎక్కువ మంది భావిస్తారు.

ఈ సారి అందుకు అవకాశం లేకుం డా పోయింది. ఉగాది తరువాత కేవలం 5 ముహూర్తాలు మాత్రమే ఉన్నాయని, ఆ తరువాత లేవని పండితులు చెబుతున్నారు.

### మొదలైన పెళ్లి హడావుడి ...

పెళ్లి హడావుడి మొదలైంది. ముహూర్తాలు సైతం పెట్టుకున్నారు. ఫంక్షన్ హాళ్లకు, కల్యాణ మండపాలకు, ఫొటో, వీడియోగ్రఫీ, డెకరేషన్, క్యాటరింగ్ వాళ్లకి డిమాండ్ పెరిగింది. షాపింగ్‌లతో వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, వివిధ శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే పెళ్లి సంబంధాలు కుదిరి శుభ ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్న వారు ఇక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుభ ముహూర్తాలు అధికంగా ఉండడంతో పెళ్లిళ్లు జోరందుకోనున్నాయి.

### ఏప్రిల్ 26 వరకు ముహూర్తాలు..

**యెల్లంబట్ల శశిధర్‌శర్మ, వేద పండితుడు**



ఉత్తరాయణ కాలంలో వివాహ సుముహూర్తాలు ఉత్తమమైనవి. మాఘమాసం ప్రారంభం నుంచి అనగా ఈనెల 13 నుంచి ఏప్రిల్ 26 వరకు మూడు నెలల పాటు దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. ఉపనయనాలు, వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు ఇదే మంచి తరుణం. మాఘమాసంలో అన్ని రకాల శుభకార్యాలకు అనువైన ముహూర్తాలు ఉండడం విశేషంగా చెప్పవచ్చు. ఈ ముహూర్తాలు దాటితే మళ్లీ శ్రావణమాసం వరకు శుభ దినాలు లేవు. ఈసారి వివాహాలు ఎక్కువగానే జరిగే అవకాశం ఉంది.

# కేయూ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: కేయూ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి బదిలీ అయిన శ్రీధర్ రాకను మంత్రి ద్వారా అడ్డుకున్నట్లు సమాచారం. కాగా, కొన్ని రోజుల కిందట వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరగగా.. కేయూలో పని చేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఖమ్మంలో పని చేస్తున్న సీహెచ్. శ్రీధర్‌ను నియమించారు. అయితే శ్రీధర్ రాకపై సందిగ్ధత ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంపాటు ఎస్ఐ, సీఐగా పని చేసిన శ్రీధర్ అక్కడి బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అక్కడ చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలను వేధించడంతోపాటు కొందరిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కమిషనరేట్‌లోని కీలకమైన కేయూ పీఎస్‌లో పోస్టింగ్ పొందడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఎలాగైనా శ్రీధర్ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విదేశాల్లో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో సీపీకి విషయం తెలుపగా ఆయన నిఘావర్గాల ద్వారా శ్రీధర్ సర్వీస్ గురించి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారి శ్రీధర్‌కు ఫోన్ చేసి కేయూ పీఎస్‌లో జాయిన్ కావొద్దని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో శ్రీధర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. అయితే కేయూకు వీఆర్, ఎస్‌బీలో ఉన్న ఓ అధికారుల్లో ఎవరికైనా విధులు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

# భారీగా ఎంపీడీవోల బదిలీలు

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. మరో రెండు మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు పూర్తి అయిన ఎంపీడీవోలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 395 మంది ఎంపీడీవోలు బదిలీ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5 ఎంపీడీవోలు, జనగామ జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి 8 ఎంపీడీవోలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 16 ఎంపీడీవోలు, ములుగు జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, వరంగల్ నుంచి 10 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. సోమవారం రిలీవ్ కానున్న ఎంపీడీవోలు మంగళవారం వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

- **హనుమకొండ జిల్లా ఎంపీడీవోలు :** జవహర్‌రెడ్డి ములుగు జిల్లాకు, టి.సునిత కరీంనగర్, జి.వెంకటరమణ వరంగల్, ఎల్.భాస్కర్ జయశంకర్ భూపాలపల్లి, ఆర్.రామకృష్ణ ములుగు బదిలీ అయ్యారు.
- **జనగామ జిల్లా ఎంపీడీవోలు:** మహ్మద్ హసీం సూర్యాపేట, బి.సురేందర్ ఖమ్మం, వి.అశోక్‌కుమార్ ఖమ్మం, శ్రీధర్‌స్వామి ఖమ్మం, పి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, వి.రాజా త్రివిక్రం సిద్దిపేట బదిలీ అయ్యారు.
- **భూపాలపల్లి జిల్లా ఎంపీడీవోలు:** కె.అనిల్‌కుమార్ హనుమకొండ, ఎల్.అరుంధతి వరంగల్, పి.ఆంజనేయులు వరంగల్, జి.సురేందర్ ఖమ్మం, ఎం.శంకర్ వరంగల్, జి.నరసింగహమూర్తి వరంగల్, ఎ.రవీంద్రనాథ్ ఆదిలాబాద్, వి.క్రిష్ణవేణి వరంగల్ బదిలీ అయ్యారు.
- **మహబూబాబాద్ జిల్లా ఎంపీడీవోలు:** జి.రవిందర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం, ఎం.సత్యనారాయణరెడ్డి సూర్యాపేట, జి.రవిందర్ ఖమ్మం, వి.అపర్ణ రంగారెడ్డి, పి.వెంకటేశ్వర్లు హనుమకొండ, బి.వి.చలపతిరావు భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.కుమార్ ఖమ్మం, బి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, బి.భారతి భద్రాద్రి కొత్తగూడెం, కె.ధన్‌సింగ్ భద్రాద్రి కొత్తగూడెం, బి.గోవిందరావు వరంగల్, కె.శ్యాంసుందర్ జయశంకర్ భూపాలపల్లి, కె.వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి, పి.సరస్వతి ఖమ్మం, ఎ.రోజారాణి ఖమ్మం, కె.శేషాద్రి ఖమ్మం బదిలీ అయ్యారు.
- **ములుగు జిల్లా ఎంపీడీవోలు:** అబ్బూరి ఫణిచంద్ర వరంగల్, సీహెచ్.శ్రీనివాస్, వరంగల్, జె.ప్రవీణ్‌కుమార్ హనుమకొండ, ఎం.సత్యాంజనేయ ప్రసాద్ యాదాద్రి భువనగిరి, ఎండి.ఇక్బాల్ హుస్సేన్ జయశంకర్ భూపాలపల్లి, అద్దూరిబాబు జయశంకర్ భూపాలపల్లి బదిలీ అయ్యారు.
- **వరంగల్ జిల్లా ఎంపీడీవోలు:** సీహెచ్.సంతోష్‌కుమార్ సూర్యాపేట, టి.రాజ్యలక్ష్మి ములుగు, ఎ.క్రిష్ణమూర్తి మెదక్, జి.క్రిష్ణ ప్రసాద్ ములుగు, ఎన్.విజయ్‌కుమార్ హనుమకొండ, ఎస్.వీరేషం హనుమకొండ, జి.రాజేంద్రప్రసాద్ ములుగు, పి.సుమనవాణి ములుగు, ఎం.వెంకటేశ్వర్‌రావు జయశంకర్ భూపాలపల్లి, జి.అనిత ములుగుకు బదిలీ అయ్యారు.

# వైద్యులపై చర్యలు తీసుకోండి..

### హసన్‌పర్తి పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: గాల్‌బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని తన భార్యను ఆస్పత్రిలో చేరిస్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓబాధితుడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగ ల్ జిల్లా కరీమాబాద్ తోటకు చెందిన ఎమ్డీ అన్వర్ తన భార్య నస్రీన్‌కు గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఆరెపల్లిలోని రిలీఫ్ ఆస్పత్రిలో ఈ నెల 5న చేర్పించారు. 9వ తేదీన అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత కొంత సమయానికి నస్రీన్‌కు మూత్రం ఆగిపోయింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు చికిత్స చేసినట్టు చేసి చివరికి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని వేరే ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి చికిత్స చేస్తుండగా శనివారం సా యంత్రం నస్రీన్ మృతి చెందింది. తనభార్య మరణానికి రిలీఫ్ ఆస్పత్రి సిబ్బందే కారణమని, అక్కడి డాక్టర్లతోపాటు నిర్వాహకులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# 'మల్లికాంబ'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న రామమ్ చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

సుబేదారి, ఫిబ్రవరి 11: రామమ్ చిట్‌ఫండ్స్ 16వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామమ్ చిట్‌ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు, చిట్‌ఫండ్స్ సిబ్బంది, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


మేడారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాల



# 'ఆరోగ్య' జాతర!

- మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
- జాతర పరిసరాలు, దారుల్లో 72 మెడికల్ క్యాంపులు
- 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది నియామకం

ములుగు, ఫిబ్రవరి 10: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఈసారి ప్రభుత్వం రూ. కోటి నిధులను కేటాయించగా ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతర పరిసరాల్లో తాత్కాలిక పెద్దాస్పత్రి, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఓపీ సేవలు కొనసాగుతుండగా, ఈనెల 20నుంచి జాతర ముగిసేంత వరకు ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నారు. ఎప్పటిలాగే మేడారం జాతరలో 50 పడకలతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో తొమ్మిది మంది వైద్యనిపుణులు పనిచేయనున్నారు. షిఫ్టునకు 10మంది చొప్పున స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలతో ఇక్కడ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ 24 గంటల సేవలను అందించనున్నారు. మేడారం ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో ఆరు బెడ్లతో మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో 30మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి క్రాస్‌రోడ్డు, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు-రెడ్డిగూడెం రోడ్ డ్యామ్, జంపనవాగు, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఆర్‌టీసీ బస్టాండు, ఇంగ్లీషు మీడియం స్కూల్, మేడారం చెరువు, పోలీసు క్యాంపు, చిలుకలగుట్ట, వీవీఐపీ పార్కింగ్ ప్లేస్, పడిగాపూర్, హరిత హోటల్, కొత్తూరు సబ్‌స్టేషన్, వెంగ్లాపూర్, మేడారం-తాడ్వాయి రోడ్డు, గద్దెల ప్రధాన ద్వారం, బయ్యక్కపేట రోడ్డు, కన్నెపల్లి జంక్షన్ రోడ్డు, ఊరట్టం రోడ్డు మామిడి తోట, మేడారం గ్రామపంచాయతీ సమీపంలోని రెండో గేటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా మేడారం వచ్చే ప్రధాన దారుల్లో కూడా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గూడెప్పాడ్, కటాక్షపూర్, మల్లంపల్లి, గట్టమ్మ దేవాలయం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డు, చల్వాయి క్రాస్‌రోడ్డు, లక్నవరం, పస్రా, కాల్వపల్లి, రేగులగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, కాటారం, తాడ్వాయి, బీరెల్లి, కొత్తూరు, కాటాపూర్, ఆకులవారి ఘనపూర్, ముల్లకట్ట బ్రిడ్జి, జగన్నాధపురం, చీకుపల్లి, టేకులగూడెం, వెంకటాపురం,


భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మంగపేట, మల్లూరు, రాజుపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్, మేడారం క్రాస్‌రోడ్డు, రామప్ప, గుర్రంపేట, గణపురం క్రాస్‌రోడ్డు వద్ద మొత్తం 42 క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. భక్తులు చిన్న అనారోగ్యానికి గురైనా ఈ శిబిరాలను సంప్రదిస్తే అక్కడ 24గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలను అందించనున్నారు. ఇద్దరు డాకర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సహాయక సిబ్బంది కలిపి మొత్తం 10మంది విధుల్లో ఉంటారు.

## 680 మంది డాక్టర్లు, సిబ్బంది

వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద సంఖ్యలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని జాతర విధులకు నియమించనుంది. 150 మంది వైద్యులు, 530 మంది పారామెడికల్ సిబ్బందితో భక్తులకు సేవలు అందించనుంది. ములుగు, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల నుంచి 150 మంది డాక్టరను పిలిపిస్తున్నారు. అదే విధంగా ఎంజీఎం, సీకేఎం, రీజనల్ ఐహాస్పిటల్, జీఎంహెచ్ నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. 60మంది నాలుగో తరగతి ఉద్యోగులు సహాయకులుగా సేవలందించనున్నారు. ఐఎంఏ సహకారంతో ఓ గుండెవైద్య నిపుణుడిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను కూడా నియమించనున్నారు.


మేడారం తాత్కాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

## 40 బైక్ అంబులెన్స్‌లు

మహాజాతర సమయంలో మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దారులన్నీ ఇసుకేస్తే రాలనంత తయారవుతాయి. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర సేవల కోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించనున్నారు. ఇందుకు 40బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు 16ను కూడా సిద్ధం చేస్తున్నారు. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవల కోసం నాలుగు అంబులెన్స్‌లు, ఆరు ఆర్‌బీఎస్‌కే, మూడు ఎంసీహెచ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. అదేవిధంగా 120 మంది 108సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నారు.

## ఏడుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లు

అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు జరిపేందుకు ఆరుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లను(రెఫరల్ హాస్పిటల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల సీహెచ్‌సీలు, తాడ్వాయిలోని పీహెచ్‌సీలో 10పడకలు, పస్రాలో ఐదు పడకలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

## కొనసాగుతున్న వైద్యసేవలు

జనవరి 14 నుంచి మేడారంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 3,850 మందికి ఓపీ సేవలు అందించారు. 50వేల మాస్కులు, రూ.7లక్షల 50వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 13 నుంచి 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర జరిగే 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజూ తొమ్మిది మంది వైద్య నిపుణులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. తాడ్వాయిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజ్ సెంటర్ నుంచి మందులు తెప్పిస్తున్నారు. ఈసారి కోటి 60లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. 2022 జాతరలో మొత్తం 2 లక్షల 9వేల మంది ఓపీ, 5,222మందికి ఐపీ సేవలు అందించింది.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

### డాక్టర్ అల్లెం అప్పయ్య, ములుగు జిల్లా డీఎంహెచ్‌వో



మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. తాత్కాలిక ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 13నుంచి జాతర ముగిసేంత వరకు 24గంటల వైద్యసేవలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో జాతరలోని ప్రధాన ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో ఇప్పుడు వాడుతున్న మందులను వెంట తెచ్చుకోవడం మంచిది. సురక్షితమైన ఆహారం, తాగునీటిని తీసుకోవాలి. ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. ఏదైనా అనారోగ్యం సోకితే సమీపంలోని వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా సేవలు పొందాలి.


ములుగులో ఇసుక లారీలను దారి మళ్లిస్తున్న పోలీసులు

# ఇసుక లారీలపై నియంత్రణేదీ?!

### నిలుపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోని యంత్రాంగం

ములుగు, ఫిబ్రవరి11: మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. జాతీయ రహదారి పనులకు తోడు ఇసుక లారీల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. జాతరకు సమయం దగ్గరపడుతుండగా పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలలో తలివస్తున్నారు. ఆర్టీసీ కూడా స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. ఈనేపథ్యంలో లారీల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ములుగు-గూడెప్పాడు మధ్య 163జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. గట్టమ్మ దేవాలయం-మల్లంపల్లి మధ్య రహదారి కంకర పోసి చదును చేస్తున్నారు. కల్వర్టు పనులూ కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో భారీగా వచ్చే వాహనాలు దారి ఇరుగ్గా ఉండటంతో ముందుకు కదలలేక పోతున్నాయి. ఆదివారం భూపాల్‌నగర్ స్టేజీ వద్ద ఓ లారీ రోడ్డుపైనే దిగబడటంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మేడారం భక్తులు, సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇసుక లారీలను ములుగులో దారి మళ్లించారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుకు అనుమతించారు. గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద కల్వర్టు పనులు జరుగుతుండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇసుక లారీలను నిలిపివేతపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఆదిశగా చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి పనుల జాప్యంపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేశారు. అయితే పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకైన కల్వర్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే కొంతవరకు సమస్య పరిష్కారమయ్యేది. కానీ, వాహనాలు నిలిచిపోయేదాకా ఎవ్వరూ స్పందించకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఇసుకలారీలపై ఆంక్షలు విధించాలని, జాతీయ రహదారి విస్తరణ జరిగే ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క ఎస్పీ, పీవో

# సకల సౌకర్యాలతో మహాజాతర

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 11: మహా జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జాతరకువచ్చే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్య కల్పిస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, గవర్నర్ తమిళిసై మేడారానికి రానున్నారని, అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు ఉన్నారు.

## ఉత్సవ కమిటీని ప్రతిపాదించిన మంత్రి

మేడారం మహాజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీపై మంత్రి సీతక్క దేవాదాయశాఖ కమిషనర్‌కు 15మందితో ప్రతిపాదనలు పంపారు. చైర్మన్‌గా అరెం లచ్చుపటేల్‌తోపాటు 14 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. మిలుకూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచ షైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సిద్దబోయిన జగ్గారావు పేర్లను పేర్కొన్నారు.







బెల్లంతో వెళుతున్న భక్తురాలు

# మేడారంలో మొక్కుల సందడి

### వనదేవతల దర్శనానికి తాకిడి




యాటను మొక్కుతున్న దృశ్యం


వనదేవతల దర్శనానికి బెల్లంతో వెళుతున్న మహిళా భక్తులు


జంపన్నవాగు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న దృశ్యం

# సొసైటీ ప్రతినిధుల సేవలు అభినందనీయం

**నష్కల్ ఆలయ వైస్ చైర్మన్ మోడెం స్వామి**



నష్కల్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సమగ్రసర్వే చేస్తున్న స్థపతి

చిలుపూర్, ఫిబ్రవరి 11: మండలంలోని నష్కల్ సీతారాముల ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన ఎస్ఎస్ఆర్ సేవా సొసైటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని ఆలయ వైస్ చైర్మన్ మోడెం స్వామి అన్నారు. ఆదివారం స్థానిక సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ప్రముఖ స్థపతి, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ముచ్చింతల్ - శంకరాచార్యుల విగ్రహ రూపకర్త ప్రసాద్ నేతృత్వంలో చేపడుతున్న సమగ్ర సర్వే పనులను వారు పరిశీలించారు. ఆగమ శాస్త్ర, వాస్తు ప్రకారం చారిత్రక ఆలయాన్ని రూపుదిద్దడం కోసం రాజకీయ పార్టీలకతీతంగా గ్రామస్థులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి ఆరుట్ల సింగరాచార్యులు, కర్ణకంటి వెంకటేశ్, మోడెం వేమన, జూలూరు రాజు, కోరుకొప్పుల రాజు, పాశికంటి గట్టయ్య, ఇమ్మడి లక్ష్మన్, కోరుకొప్పుల సంపత్, టెక్నీషియన్లు రవిగౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న సతీష్




అవార్డు అందిస్తున్న అకాడమీ అధ్యక్షుడు రాధాకృష్ణ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 11: బహుజన సాహిత్య అకాడమీ వారు అందించే జాతీయ సేవా రత్న అవార్డును స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కొలిపాక సతీష్ అందుకున్నారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రజాకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ చేతుల మీదుగా సతీష్, సునిత దంపతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తన తల్లి సరోజన జ్ఞాపకార్థం నిర్వహించిన తాను సేవలు గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారని అన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల అకాడమీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత

జఫర్‌గడ్, ఫిబ్రవరి 11 : మండలంలోని కూనూరుకు చెందిన గుడ్డేటి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కుమార్తె సుజాతతో కలిసి స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న టెన్త్ బ్యాచ్ మిత్రులు స్పందించి ఆర్థిక చేయూతనందించారు. తలా కొంత డబ్బును పోగు చేసుకుని మొత్తం రూ.10 వేలు ఆదివారం సుజాత కుటుంబీకులకు అందజేశారు. వారిలో శ్రీనివాస్, అజ్గర్ పాషా, సంపత్, డిష్ రాజు, కుమార్, కోటి రత్నం, ప్రేమ్‌దాస్, అజీంపాషా, మధుసూదన్‌రెడ్డి, కుమారస్వామి, రవీందర్ ఉన్నారు.

# 18న దొడ్డి కొమురయ్య ట్రస్ట్ భవన్ ప్రారంభం

జనగామ టౌన్, ఫిబ్రవరి 11: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం ఆధ్వర్యంలో ఈ నెల 18న కోకాపేటలో దొడ్డి కొమురయ్య స్మారక ట్రస్ట్ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెవెల్లి సంపత్ తెలిపారు. ఆదివారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 18న స్మారక ట్రస్ట్ భవన్ ప్రారంభం సందర్భంగా జరిగే సభకు కురుమలు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కురుమ సంఘం నాయకులు కంచ రాములు, చిన్నం నర్సింహులు, సెవెల్లి మధు, ఆలేటి రాజు, కేమిడి ఉపేందర్, శ్రీనివాస్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# మాయమైపోతోంది!

- నెల్లుట్ల వాగు నుంచి తరలిపోతున్న ఇసుక
- రాత్రింబవళ్లు జోరుగా సాగుతున్న దందా
- ట్రాక్టర్లకు బదులు ట్రాలీఆటోల్లో రావాణా
- రోజురోజుకూ పడిపోతున్న భూగర్భజలాలు
- అధికారులు అడ్డుకోవాలంటున్న అన్నదాతలు

లింగాలఘణపురం, ఫిబ్రవరి11: లింగాలఘణపురం మండలం నెల్లుట్ల కేంద్రంగా ఇసుక దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తోంది.. రాత్రిపగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుక రవాణా సాగుతున్నా పట్టించుకునే అధికారులు కరువైపోయారు. ఒకప్పుడు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక దందా చేసే వారిపట్ల మైనింగ్ అధికారులు ఉక్కుపాదం మోపడంతో ఇప్పుడు రూటు మార్చి కొత్త కోణంలో ట్రాలీ ఆటోలతో ఇసుకదందాకు తెగబడుతున్నారు. దీంతో నెల్లుట్ల వాగులో మొత్తం ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా కొనసాగుతున్న ఇసుక దందా వ్యవహారంపై అటు రెవెన్యూ ఇటు పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టకపోవడంతో యథేచ్ఛగా ఇసుక రవాణా కొనసాగుతోంది.



నెల్లుట్ల వాగులో ట్రాలీ ఆటోలో ఇసుక నింపుతున్న కూలీలు

## ట్రాక్టర్లకు బదులు ట్రాలీ ఆటోల్లో రవాణా..

గతంలో ఇసుక దందా మొత్తం ట్రాక్టర్ల ద్వారా సాగుతుండేది. దీంతో అధికారులు ట్రాక్టర్ల ద్వారా తరలించే ఇసుకకు అడ్డుకట్ట వేసేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తుండేవారు. దీంతో పలుమార్లు కేసులపాలై ట్రాక్టర్లు సీజ్ కావడంతో ఇప్పుడు రూటు మార్చి ట్రాక్టర్లకు బదులు ట్రాలీ ఆటోలను ఇసుకదందాకు వినియోగిస్తున్నారు. అధికారులు ట్రాలీ ఆటోల్లో కొనసాగుతున్న ఇసుక రవాణాపై పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఏకంగా నెల్లుట్ల గ్రామంలో సుమారు 30 ట్రాలీఆటోలు షో రూం ద్వారా బుకింగ్ చేసి ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ఒక్కో ట్రాలీ ఆటోకు రూ. 1000 నుంచి 1300 వరకు వసూలు చేస్తూ రోజుకు 10 ట్రిప్పులకు తగ్గకుండా ఇసుక దందాను సాగిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక కేవలం నెల్లుట్ల గ్రామానికి మాత్రమే కాకుండా పరిసర గ్రామాలు పటేల్‌గూడెం, నవాబుపేట, వడ్డిచర్ల, కొత్తపల్లి, జనగామ, లింగాలఘణపురం, బండ్లగూడెం, నేలపోగుల గ్రామాలకు సైతం అక్రమంగా తరలిస్తున్నారు.

## ఇంకిపోతున్న భూగర్భ జలాలు..

ప్రధానంగా నెల్లుట్ల ప్రాంతంలో ఇసుక దందా కారణంగా భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. వాగులో ఎక్కడపడితే అక్కడ గొయ్యిలు తీస్తూ ఇసుకను తోడుతుండటంతో బావులు, బోర్లలో నీళ్ల రోజురోజుకూ లోతునపడుతున్నాయి. దీంతో బోర్లు నీళ్లు తక్కువగా పోస్తున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే బోరుబావులు నీరందించలేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇసుక మాఫియా బెదిరింపులు

నెల్లుట్ల వాగు నుంచి ఇసుకను తరలించొద్దని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న స్థానికులపై ఇసుక మాఫియా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కూడా తెలుస్తోంది. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక మాఫియా బ్యాచ్ వాగులో అడ్డా వేసి మద్యం మత్తులో తూగుతూ అటుగా వచ్చే వ్యక్తులను బెదిరింపులకు గురిచేస్తే ఇంకెవరూ రాకుండా ఉంటారని ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం.

## పట్టించుకోని అధికారులు..

నెల్లుట్ల కేంద్రంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాలీ ఆటోల వ్యవహారంపై అధికార యంత్రాంగం పట్టింపు లేకుండా వదిలేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. అయితే ఈ దందా కొద్ది మంది అధికారుల కనుసన్నుల్లోనే జరుగుతోందనే ఆరోపణలు కూడా నెల్లుట్లలో వినిపిస్తున్నాయి. అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాను అడ్డుకునేందుకు అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# తండ్రీ కూతుళ్లకు బంగారు పతకాలు



హాసినికి ప్రశంసాపత్రం అందిస్తున్న హరీష్‌రావు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 11: మండలంలోని ఆలీంపూర్ గ్రామానికి చెందిన మంతపురి గణేశ్, ఆయన కూతురు హాసిని సూర్య నమస్కారాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి బంగారుపతకాలు సాధించారు. వ్యాసమహర్షి యోగా సొసైటీ సిద్దిపేట ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 400 మందికి పైగా పాల్గొన్నారు. ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మంతపురి గణేశ్‌తో పాటు ఆయన ఎనిమిదేళ్ల కూతురు హాసిని 661 సూర్య నమస్కారాలతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. విజేతలకు మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తమ గ్రామానికి చెందిన వారు ప్రతిభ చూపటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నల్లగొండ సభకు తరలిరావాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఫిబ్రవరి 11: కృష్ణ జలాల పరిరక్షణలో భాగంగా ఈ నెల 13న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డెకొత్తపల్లిలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు నెలలు గడవకముందే వాటిని కేంద్రానికి అప్పగించిందని అన్నారు. కృష్ణా జలాల పంపిణీని కేఆర్ఎంబీకీ కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడం వల్ల ఎడమ కాల్వ రైతాంగం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, మోసపూరితమైన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయం సాధించారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు.

# ఆలయాల్లో ఆర్యవైశ్యుల పూజలు



పాలకుర్తి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజ చేస్తున్న ఆర్యవైశ్యులు

పాలకుర్తి, ఫిబ్రవరి 11: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవికన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పంచగుళ్లలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి, ఒడి బియ్యం పోశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ అధికారులు వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, చారగొండ్ల సదానందం, జగదీష్, రంగయ్య, భాస్కర్, సంతోష్, ఉపేందర్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

**లింగాలఘనపురం:** మండలంలోని జీడికల్ దేవస్థానంలో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషినల్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవిమాతకు కుంకుమార్చణలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మండలాధ్యక్షుడు దారం అశోక్, ఉపాధ్యక్షులు శివరామ క్రిష్ణ, కార్యదర్శి అనంతరాములు, కోశాధికారి బెలిదె శ్రీధర్, రమణ, గాదె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి



కొడకండ్లలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల ఫిబ్రవరి 11 : వచ్చే లోకసభ ఎన్నికలలో అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలని కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికి సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు పనస వీరయ్య కుమారుడు రాంబాబు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకుడు మార్గం వంశీ తాత నర్సయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.సురేష్, శ్రీవర్ధ, బి.రమణారెడ్డి, రాజేష్, సోమనర్సయ్య, మోహన్, రవీందర్, అంజయ్య, భిక్షపతి, అబ్దుల్లా, రమేష్, వీర్య, మనోహర్, కలీం, హేమానీ పాల్గొన్నారు.

## సేవాలాల్ విగ్రహ పుణప్రతిష్ట

పాలకుర్తి: సంత్ సేవాలాల్ మహరాజ్ ఒక సంఘసంస్కర్త అని బంజారాల ఆరాధ్యదైవం, ప్రకృతి ప్రేమికుడు, అధ్యాత్మిక గురువు అని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చీమలభాయి తండా గ్రామంలో సంత్ సేవాలాల్ విగ్రహ పుణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంజార జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాది వేశారని, అందుకే ఇతర కులాల వారికి కూడా ఆదర్శమూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ మాటూరి యాకయ్య, మాజీ సర్పంచు యాకయ్య నాయకులు అడ్డూరి రవీందర్‌రావు, రమణారెడ్డి, కిషన్‌నాయక్, గడ్డం యాకసోమయ్య, జల్లం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతిని ప్రతిబింబించేలా జాతర నిర్వహించాలి

**వీహెచ్‌పీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి**



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జయపాల్ రెడ్డి

చిలుపూర్, ఫిబ్రవరి 11: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా వన దేవతల జాతరలను నిర్వహించాలని వీహెచ్‌పీ (విశ్వ హిందూ పరిషత్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి జయపాల్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. ఆదివారం ఆయన శ్రీపతిపల్లి - కొండాపూర్ సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతరను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. అనంతరం జాతర కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డితో కలిసి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న వన దేవతల జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను మింగిన చెరువులు

(5వ పేజీ తరువాయి)

కాటారం సీఐ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. కాగా, ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

**ఈతకు వెళ్లి..**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి - రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్ (14) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా తల్లి రూప, తమ్ముడు శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఉంటున్నాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కిన్నెర మహేష్ - సావిత్రి దంపతుల కుమారుడు జంపా (12) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, నాన్నమ్మ గజ్జెలమ్మతో ఉంటున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరిద్దరు మరో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. చెరువు ఒడ్డున ఈతకొడుతూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లారు. దీంతో ఇద్దరు చిన్నారులు నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపుడి జగదీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృదేహాలను తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంధం రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ట్రాక్టర్ ఢీకొని ఐదేళ్ల బాలుడి మృతి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: ట్రాక్టర్ ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన కొర్ని రామ్మూర్తి-సౌజన్య దంపతులకు ఏకైక కుమారుడు కొర్ని సాత్విక్ (5)ఉన్నాడు. ఆదివారం వారు గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి రోడ్డువెంట నడుచుకుంటూ వస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు సాత్విక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి సౌజన్యకు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. బాలుడి తండ్రి రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# మూడో విడత ప్రాక్టికల్ పరీక్షలు షురూ



జఫర్‌గఢ్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ భైరి శ్రీనివాస్

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 10: ఇంటర్ ప్రాక్టికల్స్ మూడో విడత పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్‌లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులతో కలిపి 808 మంది కి గాను 739 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 525 మంది విద్యార్థులకు 491 మంది హాజరయ్యారు. మొత్తం 1333 మంది విద్యార్థులకు 1230 మంది (92.27 శాతం) విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. పరీక్షల సందర్భంగా జఫర్‌గడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాల, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ పరీక్షా కేంద్రాలను డీఐఈఓ భైరి శ్రీనివాస్, డెక్ సభ్యులు కె.ఆంజనేయ రాజు తో కలిసి సందర్శించారు.

# వైద్యశాలకు మోక్షమెప్పుడు?

**తరిగొప్పుల మండలం ఏర్పడి ఎనిమిదేళ్లయినా అతీగతీ లేదు ● వైద్యం కోసం నర్మెట్ట పీహెచ్‌సీకి వెళ్తున్న ప్రజలు**

తరిగొప్పుల, ఫిబ్రవరి 11: మండలం ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ వైద్యశాల నిర్మించలేదు. సరైన భవనం లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో సుమారు నాలుగువేల జనాభా ఉండగా చుట్టు పక్కల గ్రామాలైన నర్సాపూర్, అంకుషాపూర్, అక్కరాజుపల్లి, సోలిపూర్, బొంతగట్టునాగారం, బొత్తలపర్రె, అబ్దుల్‌నాగారం తదితర గ్రామాల్లో సుమారు 12 వేల జనాభా ఉంది. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యులు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు నర్మెట్ట పీహెచ్‌సీకి వెళ్తున్నారు. మండలం ఏర్పాటుచేసి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనం లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. తరిగొప్పుల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలంతా దాదాపుగా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరికి ఆరోగ్యం బాగాలేకపోతే ఆర్ఎంపీలను ఆశ్రయించడం లేదా నర్మెటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది.



తరిగొప్పుల ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న పీహెచ్‌సీ

## అధికారులు చర్యలు తీసుకోవాలి..

**వగలబోయి యాదగిరి (కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్)**



మండల కేంద్రంలో వైద్యశాలను ఏర్పాటు చేస్తే సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవు. దీంతో సమయానికి వైద్యం చేసుకునే వెలుసుబాటు ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

## మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలి..

**ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, తరిగొప్పుల**



మండల కేంద్రంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడిచినా వైద్యశాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారుల స్పందించి ప్రజల ఆంకాంక్షలకు అణుగుణంగా మండలంలో వైద్యశాలను ఏర్పాటు చేయాలి.

# 'స్వచ్ఛత సమాచార్'లో కొడవటూరు

**పారిశుధ్య నిర్వహణపై ప్రశంసలు**

బచ్చన్నపేట, ఫిబ్రవరి 11: పారిశుధ్య నిర్వహణలో కొడవటూరు గ్రామం ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వెలుబడే స్వచ్ఛత సమాచార్ సంచికలో గ్రామానికి సంబంధించిన వివరాలతో కూడిన ఆర్టికల్ ప్రచురించారు. స్వచ్ఛ గ్రామంగా వెలుగొందేందుకు పాలకమండలి, గ్రామప్రజలు తీసుకున్న చొరవను ప్రస్తావించారు. కమ్యూనిటీ కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటు చేయడం, వ్యర్థాల సేకరణ, కమ్యూనిటీ సోక్‌పిట్లు, డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించటం, జీపీలో అన్ని ప్రమాణాలను మెరుగుపర్చి ఆదర్శ గ్రామంగా నిలపడంతో మోడల్ గ్రామంగా పేర్కొన్నారు. బహిరంగ మలవిసర్జనను నిషేధించి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలనే సంకల్పంతో పనిచేశారని ప్రసంశించారు. మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి నేతృత్వంలో కొడవటూరు గ్రామానికి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పురస్కారాలు అందించాయి.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



బాలరాజు (ఫైల్)

నర్మెట, ఫిబ్రవరి 11: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి భార్య మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండలకేంద్రానికి చెందిన ముక్కెర బాలరాజు (38) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మానుకోవాలని అతడి భార్య భాగ్య పలుమార్లు మందలించింది. డాక్టర్లు సైతం ఆరోగ్యం చెడిపోతుందని హెచ్చరించారు. అయినా తను మద్యం మానలేదు. శనివారం రాత్రి కూడా తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పశువుల కొట్టంలో చీరతో ఉరేసుకున్నాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.